## బాధిత గీతం

హక్కులన్నీ
వంశపారంపర్యంగా
సంక్రమిస్తున్నప్పుడు
ఎవరికి వారు గీసుకున్న
హద్దులే హక్కులవుతున్నప్పుడు
సకల జీవరాశులూ బాధితులే!
పరి రక్షకులు
పరి రక్షకుల పరిరక్షకులూ బాధితులే!

ఇక్కడ భయమంటే మృత్యునీడే!
బాధితులకు మౌనాన్ని ప్రసాదించినా
భయం గుప్పిట్లోనే!

హక్కులతో హాయిగా ఆడుకునే వారికి
ఏ గాలికీ ఎగిరిపోకుండా
భాష్యకారుల నైరూప్య వర్ణాల వల
సిద్ధంగానే ఉంటుంది
అధికార కవచాలూ అందుబాటులోనే ఉంటాయి
ప్రదర్శన కోసమే బాధితుల బురఖాలు
ఎంతైనా ఇక్కడ
మనుషులమీద కంటే
ఫలితాల మీదే నమ్మకం!
ఆ దిశలోనే శక్తియుక్తుల వ్యూహరచనలన్నీ

అబద్ధానికి అబద్ధానికి మధ్య
అనుమానాస్పద జీవితంలో

ఎవరైనా సరే ఇక్కడ
అన్ని రకాల విద్యుద్ఘాతాలకీ అలవాటు పడాలి